
# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :190 | ప్రచురణ : హైదరాబాద్ | శుక్రవారం,22-05-2026 | పేజీలు: 8 | వెల : 3- 00

# వామ్మో.. 48 డిగ్రీలు!

తెలుగు రాష్ట్రాల్లో రోళ్లు పగిలే ఎండలు..

రికార్డులు బద్దలు కొడుతున్న ఉష్ణోగ్రతలు..

హైయెస్ట్ రిపోర్ట్ చూస్తే మంటలే..

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి.


ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రికార్డు స్థాయిలో

48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి

పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది

వచ్చే వారం రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం

ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం బయటకు రావొద్దని సూచన



సమ్మర్ హీట్ నెక్ట్స్ లెవెల్‌కి చేరింది. బయటకొచ్చారా.. మాడు పగిలిపోద్ది అంటూ డేంజర్ బెల్స్ మోగిస్తున్నాడు సూర్యుడు. ఎండల ధాటికి తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నిప్పుల కొలిమిలా మారిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో రోళ్లు, రాళ్లు పగిలే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు నరకం చూస్తున్నారు.



### పంట కొనుగోళ్ల సంక్షోభంపై

## ఎన్నాళ్లీ మొద్దు నిద్ర

- సీఎం రేవంత్ రెడ్డిని నిలదీస్తూ కేటీఆర్ లేఖ
- ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా
- రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదు
- ఆరు దశాబ్దాల పాటు పడ్డ కష్టాలు శాశ్వతంగా తీరిపోయాయి

హైదరాబాద్

పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారూ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగమేంటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. - మిగతా 2లో

# విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి

### తెలంగాణలో కార్మికులకు శుభవార్త

## కనీస వేతనాలు భారీగా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం

- జూన్ 1 నుంచి అమల్లోకి పెంచిన వేతనాలు రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించిన ప్రభుత్వం
- జోన్-1-కార్పొరేషన్లు, జోన్-2- మున్సిపాల్టీలు , జోన్-3 గ్రామీణం
- నైపుణ్యాలు పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నాం
- నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2లక్షల వరకు వేతనం ఉంటుంది
- ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించలేని చదువులు వ్యర్థం
- జర్మనీ, జపాన్, సింగపూర్‌లలో ఎన్నో ఉద్యోగాలు ఉన్నాయి



హైదరాబాద్

రాష్ట్రంలో కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. కార్మికుల కనీస వేతనాల పెంపునకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందని ఆయన వెల్లడించారు. జూన్ 1 నుంచి పెంచిన వేతనాలు అమల్లోకి రానున్నాయి. రాష్ట్రాన్ని ప్రభుత్వం మూడు జోన్లుగా విభజించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించకపోవడం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కనీస వేతన పెంపుపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అన్ని వర్గాలతో - మిగతా 2లో

## తమిళనాడు చరిత్రలో ఇదొక టర్నింగ్ పాయింట్



- క్యాబినెట్ బెర్తులు దక్కడంపై కాంగ్రెస్
- తమిళనాడు ప్రభుత్వం క్యాబినెట్ విస్తరణ
- కాంగ్రెస్ నుంచి ఇద్దరికి అవకాశం
- తమ పార్టీ నేతలు అధికారం కోసం విశ్వాసం, అంకితభావంతో గత 59 ఏళ్లుగా పనిచేస్తున్నారన్న హస్తం పార్టీ



### ఇరాన్‌పై దాడి చేయాలా..

## శాంతి చర్చలా..?

- ట్రంప్, నెతన్యాహు మధ్య విభేధాలు
- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేసిన సంగతి తెలిసిందే
- ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది
- శాంతి చర్చలు ఎటూ తేలడం లేదు.

# మందుబాబులకు బ్యాడ్‌న్యూస్

- భారీగా పెరగనున్న మద్యం ధరలు..
- తెలంగాణలోని మందుబాబులకు షాక్ తగలనుంది
- రాష్ట్రంలో మద్యం ధరలు భారీగా పెరగనున్నాయని సమాచారం
- జూన్ 2 తర్వాత దీనికి సంబంధించిన ప్రకటన ప్రభుత్వం నుంచి రావొచ్చని తెలుస్తోంది
- దీంతో మందుబాబులపై భారం పడనుంది
- బీర్ల ధరలు కూడా పెరగనున్నాయని తెలుస్తోంది
- అన్ని రకాల మద్యం ధరలు పెరగనున్నాయి



హైదరాబాద్

తెలంగాణలోని మందుబాబులకు షాకింగ్ న్యూస్. రాష్ట్రంలో మద్యం ధరలు భారీగా పెరగనున్నాయి. ఇప్పటికే ధరల పెంపుపై తుది నిర్ణయం తీసుకోగా.. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని తెలుస్తోంది. ధరల పెంపుకు సంబంధించి ఇప్పటికే కమిటీ ప్రభుత్వానికి సిఫార్సులు చేసింది. దీంతో పాటు మద్యం తయారీ కంపెనీల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో ధరలు పెంచక తప్పదని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో జూన్ 2 తర్వాత మద్యం ధరలు పెరగవచ్చని వార్తలు వినిపిస్తున్నాయి. దాదాపు 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెరగవచ్చని చెబుతున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న వస్తోంది. దీంతో ఆ తర్వాత మందుబాబులకు రాష్ట్ర ప్రభుత్వం ఝలక్ ఇచ్చేందుకు రెడీ అవుతోంది. దాదాపు అన్ని రకాల మద్యం ధరలను పెంచేందుకు సిద్ధమవుతోంది. జూన్ 2 తర్వాత దీనికి సంబంధించిన ప్రకటన రావొచ్చని తెలుస్తోంది. మద్యం తయారీకి -- మిగతా 2లో





## 60 రోజుల్లో ఉద్యోగం తెచ్చుకోండి

- లేదంటే దేశం విడిచి వెళ్లండి..
- అమెరికాలో హెచ్1బి గండం
- అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వేలమంది భారతీయులు ప్రస్తుతం ఉద్యోగాలు కోల్పోతున్నారు
- అమెరికాలో ఎదగాలని ఆశలు పెట్టుకున్న ఎంతోమంది భారతీయులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు

# కుల సమూహంలో నష్టపోయేది మహిళలే..

- మహిళల అణచివేతకు కుల-పితృస్వామ్య వ్యవస్థే కారణం
- కులాల ప్రకారం మహిళలను అణగదొక్కే పితృస్వామ్య వ్యవస్థ మరోసారి వెలుగులోకి వచ్చింది
- కాంగ్రెస్‌లో తిరోగమన ఆలోచనలకు స్థానం లేదు..



హైదరాబాద్

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసుపై కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్పందించారు. ఈ కేసుపై వస్తున్న వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధ సమానత్వానికి సమాజం ఇంకా చాలా దూరంలో ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో పోక్సో కేసు తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మీనాక్షి నటరాజన్ మాట్లాడారు. ఈ కేసులో బాధితురాలిని నిందించడం కాదని.. నేరస్తుల పెంపకాన్ని ప్రశ్నించాలని అన్నారు. నిర్భయ ఘటన నుంచి ఇప్పటి వరకు బాధితురాలినే నిందించే ధోరణి మారలేదని -- మిగతా 2లో

# పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దు నిద్ర..

-మొదటిపేజీ తరువాయి

బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు.



**కేటీఆర్ రాసిన లేఖ యథాతథంగా..**

' తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లపాటు కొండంత ధైర్యంతో బతికిన అన్నదాత ఇవాళ అత్మవిశ్వాసం కోల్పోయి రోడ్డున పడ్డాడు. ఆరు దశాబ్దాల పాటు పడ్డ కష్టాలు శాశ్వతంగా తీరిపోయాయని సంబరంగా సాగుచేసుకుంటున్న రైతు నోట్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మట్టి కొట్టింది. రైతుకు రక్షణగా కేసీఆర్ గారు అమలుచేసిన ఒక్కో పథకానికి గత రెండేన్నరేళ్లుగా పాతరేసిన మీరు మీ చేతకానితనంతో అన్నదాత వెన్నువిరిచారు.తెలంగాణ సమాచారం

ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండునెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్థనాదాలు చేస్తున్నారు. చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. 70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు.

మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదు. పెట్టుబడి సాయాన్ని వరుసగా నాలుగు సార్లు ఎగ్గొట్టినా, యూరియా కష్టాల పాలుజేసినా రైతులు అన్నింటినీ దిగమింగి పండించిన ఏ పంటను మీ ప్రభుత్వం కొనుగోలు చేసిన పాపాన పోలేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బకు తోడు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారు. అయినా కనీసం ఒక్కసారైనా మీరు ఏ ఒక్క కొనుగోలు కేంద్రం వైపు కన్నెత్తి చూసిన దాఖలా లేదు. అందుకే రైతులు మరో మార్గం కనిపించక, ఇంతకాలం కంటిపాపలా పెంచుకున్న పంటను తమ చేతులతోనే తగలబెట్టుకుంటున్నారు. ఇవాళ తెలంగాణలోని రోడ్లపై కాలిబూడిదవుతున్న ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలు. గత రెండు నెలలుగా రాష్ట్రంలో నిరసనలో పాల్గొనని రైతు లేడు, రాస్తారోకో జరగని రహదారి లేదు. ఈ 30 నెలల్లోనే సమైక్యరాష్ట్రం నాటి సకల కష్టాల్లో మళ్లీ రైతులను ముంచెత్తారు. ఇన్నాళ్లు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యంగా మార్చారు. కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న తెలంగాణ రైతుల కన్నీళ్లతో ఖాళీగా ఉన్న రిజర్వాయర్లు నిండేలా ఉన్నాయి. పగలూ రాత్రి ప్రజాసంపదను దోచుకోవడంపై తప్ప పరిపాలనపై మీకు కనీస పట్టులేకపోవడం అన్నదాతకు శాపంగా మారింది. విలువైన భూములను తెగనమ్మి వేలకోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదు. రోడ్లపై జరుగుతున్న నిరసనలనుంచి తప్పించుకునేందుకు, మీ మంత్రులు హెలికాప్టర్ లో షికార్లు కొడుతున్నారు. చివరికి మీ సొంత నియోజకవర్గం కొడంగల్ లో కూడా రైతులు రోడ్డెక్కి దుమ్మెత్తి పోసే దుస్థితి వచ్చిందంటే, సాగు ఎంతటి సంక్షోభాన్ని ఎదుర్కొంటుందో అర్థం చేసుకోవచ్చు.

వరంగల్ నుంచి ఖమ్మం దాకా అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదు. ఇక అడపా దడపా చేసే కొనుగోళ్లలోనూ ఒక్కోచోట 10 కిలోలకు పైగా తరుగుతీస్తే ఇక రైతులకు మిగిలేదేంటో మీరే సమాధానం చెప్పాలి. చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే 50 రూపాయల చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తెచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బోనస్ ఇచ్చే ముఖం మీ సర్కారుకు ఎలాగూ లేదని ఇప్పటికే తేలిపోయింది. చివరికి పంట కొనుగోలు కూడా చేయడం చేతకాకపోతే రాష్ట్రంలోని 60 లక్షల మంది రైతులకు మీరు క్షమాపణలు చెప్పి ముక్కు నేలకు రాయండి. అన్నదాతలు అడుగడుగునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి, పర్యాటక వారోత్సవాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, చివరికి పోయి కూడా లేదని తేలిపోయింది.

కేసీఆర్ గారి హయాంలో మూడు నెల ముందు నుంచే పంటల కొనుగోలు ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేసే వారు. గన్నీ బ్యాగుల నుంచి మొదలుకుని రైతుల ఖాతాల్లో పంట డబ్బులు సకాలంలో జమ అయ్యేదాకా నిరంతర సమీక్షలతో పర్యవేక్షించేవారు. కరోనా కష్టకాలంలోనూ రైతు కల్లాల వద్దకే వెళ్లి చివరి గింజ వరకూ కొని రైతుల్లో అచెంచలమైన ఆత్మవిశ్వాసాన్ని నింపారు. అలా పండుగలా సాగిన వ్యవసాయంపై మీరు పగబట్టి రైతులకు చేసిన ద్రోహం అందరికీ అర్థమైపోయింది. రైతులు తమ పంటకు నిప్పు పెట్టుకుంటున్నా మొద్దునిద్ర వీడని ముఖ్యమంత్రిని చూసి యావత్ రైతాంగం శాపనార్థాలు పెడుతోంది. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు చివరికి టార్పాలిన్లు కూడా సమకూర్చలేని మీ కాంగ్రెస్ సర్కారు ఉండి రైతులకు ఏం ప్రయోజనం. అనేక చోట్ల చెడగొట్టు వానలు పడి కళ్లముందే పంట కొట్టుకుపోతున్నా కాపాడుకోలేని నిస్సాహాయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో సంబురంగా సాగిన సాగును కష్టాల కడలిలో ముంచెత్తిన మీ పాపానికి ఇప్పటికే వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్యల పాలయ్యారు. రైతుల ఆర్థనాదాలు ఏమాత్రం వినిపించుకునే తీరిక లేని మీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి. మొత్తంగానే వ్యవసాయాన్ని పాతాళంలోకి నెట్టిన మీ దద్దమ్మ పాలనపై ఇప్పటికే రైతుల్లో తిరుగుబాటు మొదలైంది. 60 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు మరణశాసనం రాసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

రాష్ట్రమంతా రైతుల నిరసనలు హోరెత్తుతున్న ఈ తరుణంలో 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టండి. వేలాది కొనుగోలు కేంద్రాల్లో గుట్టలుగా పేరుకుపోయిన ప్రతి పంటను కొని వెంటనే రైతుల కష్టానికి ప్రతిఫలాన్ని అందించండి. అలాగే మీరు చేసిన పాపాలకు ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద కన్నుమూసిన రైతుల కుటుంబాలకు 25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించండి. లేకపోతే మీరు చరిత్రలో ఎప్పటికీ రైతు ద్రోహిగానే మిగిలిపోతారు.' అని సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు.

## విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

సంప్రదింపులు జరిపి పలు కీలక సిఫార్సులు చేసిందని వివరించారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నప్పుడే ఉత్పత్తి బాగుంటుందన్నారు. అన్‌స్కిల్, సెమీ స్కిల్, హైస్కిల్ కేటగిరీలుగా విభజించిందన్నారు. కార్మికుల వేతనాలు నిర్ణయించేందుకు గాను జోన్లను 3 జోన్లుగా విభజించామని తెలిపారు. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్లు. జోన్-2 మున్సిపాల్టీలు. జోన్-3 కింద గ్రామీణ ప్రాంతాలు ఉంటాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జోన్-1లో అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనంను రూ.12,750 నుంచి రూ.16వేలకు, సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ. 13,592 నుంచి రూ.17వేలకు, స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.రూ.13,772 నుంచి రూ.18,500కి, హై స్కిల్డ్ కార్మికులకు సంబంధించి రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచామని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్? నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు.

**విదేశీ ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలి**

స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యాలు పెంచుకుంటేనే విదేశాల్లో రూ.2లక్షల వరకు వేతనం ఉంటుందని వివరించారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించలేని చదువులు వ్యర్థమని ఆయన అభిప్రాయపడ్డారు. జర్మనీ, జపాన్, సింగపూర్‌లలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల వైట్‌కాలర్ ఉద్యోగాలకే ముప్పు అని బ్లూ కాలర్ ఉద్యోగాలకు ఉండదన్నారు. నైపుణ్యాలు ఉన్న వారు కావాలని విదేశాలు తమను సంప్రదిస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు.

"ఏఐతో కోట్లాది ఉద్యోగాలకు ముప్పు వస్తోంది. జర్మనీ, జపాన్, సింగపూర్‌లో ఎన్నో ఉద్యోగాలు ఉన్నాయి. రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు ఉన్నవారు కావాలని విదేశాలు మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నాం. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2 లక్షల వరకు వేతనం ఉంటుంది. నైపుణ్యాలు పెంచేందుకు ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేలు ఇస్తున్నాం"

గత ప్రభుత్వ హయాంలో హయాంలో కనీస వేతన సవరణ చేయలేదు : బీఆర్ఎస్ హయాంలో కనీస వేతన సవరణ చేయలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కార్మికులు సంతృప్తిగా ఉన్నపుడు మాత్రమే ఉత్పత్తి బాగుంటుందని అభిప్రాయపడ్డారు. వేతనాల సవరణకు సీఎం రేవంత్ రెడ్డి ఒక కేబినెట్ సబ్? కమిటీని ఏర్పాటు చేశారని వివరించారు. కనీస వేతన సవరణ ప్రభావం 1.11 కోట్ల మందిపై ఉంటుందని తెలిపారు.

**బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు**

వాహనాలు తనిఖీ చేస్తుండగా బండి భగీరథ్‌ను అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. పోలీసులు చెప్పిందే నమ్ముతా. బండి సంజయ్ అప్పగిస్తే... ఇంటికి పోలీసులను పిలిచి అప్పగించాల్సి ఉండేది. అప్పా జంక్షన్ వద్ద భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? రోడ్డు మధ్యలో భగీరథ్‌ను అదుపులోకి తీసుకుంటే సరెండర్ ఎలా అవుతుంది. నేను పోలీసుల మాట నమ్మాలా?.. నేతల మాటలు నమ్మాలా? ఫిర్యాదు అందిన వెంటనే పద్ధతి ప్రకారం చర్యలు తీసుకున్నాం. బీఆర్ఎస్ నేతలు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారు. వారే విచారించి.. వాళ్లే తీర్పు ఇచ్చేస్తున్నారు. పోక్సో కేసులో మైనర్ వివరాలు వెల్లడిస్తే.. వాళ్లకు ఎంతో ఇబ్బంది. బాలిక విషయంలో రాజకీయాలు చేయటం ఎందుకు? కేటీఆర్ కావాలంటే.. రాజకీయంగా కొట్లాడాలి" అని సీఎం అన్నారు

## మందుబాబులకు బ్యాడ్‌న్యూస్..

-మొదటిపేజీ తరువాయి



ఎక్కువ వ్యయం అవుతుందని, ధరలను పెంచాలని ప్రభుత్వానికి కంపెనీలు ఎప్పటినుంచో వినతులు అందిస్తున్నాయి. పెంచకపోతే తమకు ఆర్థిక భారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో సీసాల ధరలు పెరిగాయి. అంతేకాకుండా కమర్షియల్ గ్యాస్ ధరలు పెరగడంతో తయారీ ఖర్చు 15 నుంచి 20 శాతం వరకు పెరిగిందని కంపెనీలు చెబుతున్నాయి. వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు వెయ్యికిపైగా పెరిగాయి. దీంతో కంపెనీల ఒత్తిడి, కమిటీ సిఫార్సుల మేరకు మద్యం ధరల పెంపునకు రేవంత్ సర్కార్ మొగ్గు చూపింది.

**పెరగనున్న అన్ని బ్రాండ్ల ధరలు**

సాధారణ, మీడియం బ్రాండ్లతో పాటు ప్రీమియం ధరల బ్రాండ్ల ధరలను కూడా పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం పెరగనుంది. అయితే మద్యం ధరలకు సంబంధించి గతంలో రేవంత్ సర్కార్ ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇతర రాష్ట్రాల్లోని మద్యం ధరలు, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను అంచనా వేసింది. దీని ఆధారంగా 25 నుంచి 30 శాతం వరకు పెంచాలని ప్రభుత్వానికి నివేదికలు ఇటీవల అందించింది. అయితే అంత మొత్తంలో పెంచితే మందుబాబుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశముంటుంది. దీంతో 15 శాతం వరకు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కాగా రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు మద్యం ధరలు పెంచలేదు. ఇప్పుడు తొలిసారి ధరలను పెంచేందుకు రెడీ అవుతోంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో మద్యం ధరలు తక్కువగా ఉన్నాయి.

## కుల సమూహంలో నష్టపోయేది మహిళలే..



-మొదటిపేజీ తరువాయి

మీనాక్షి నటరాజన్ విమర్శించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఫిర్యాదు నమోదవడంతో పలు ప్రశ్నలు ఎదురవుతున్నాయని తెలిపారు. కులాల ప్రకారం మహిళలను అణగదొక్కే పితృస్వామ్య వ్యవస్థ మరోసారి వెలుగులోకి వచ్చిందని ప్రస్తావించారు. కుల సమూహంలో నష్టపోయేది మహిళలేనని పెరియార్ వ్యాఖ్యలను గుర్తు చేశారు. బాలికల దుస్తులు, పెంపకంపై విమర్శలు చేయడం దారుణమని ధ్వజమెత్తారు. పితృస్వామ్య సమాజంలో అబ్బాయిల హింసాత్మక ప్రవర్తనను సాధారణంగా చూస్తున్నారని అన్నారు.

**కాంగ్రెస్‌లో తిరోగమన ఆలోచనలకు స్థానం లేదు..**

కాంగ్రెస్‌లో తిరోగమన ఆలోచనలకు స్థానం లేదని మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. నీతి సూత్రాలు మాట్లాడేవారు ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. వ్యక్తులపై నిందలు కాదని.. పితృస్వామ్యంపై పోరాటమే అవసరమని వ్యాఖ్యానించారు. రాజకీయ పార్టీల్లో  ఏర్పాటు చేయాలని సూచించారు. సామాజిక న్యాయం తర్వాత ఇప్పుడు లింగ న్యాయం కోసం కూడా పోరాడాలని చెప్పుకొచ్చారు. లింగ న్యాయం వర్ధిల్లాలని మీనాక్షి నటరాజన్ ఆకాంక్షించారు.

# బీజేపీ అస్త్రం... ఎస్ఐఆర్





**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య సరికొత్త వ్యూహాత్మక యుద్ధం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జులై 24 వరకు రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగనుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, మరణించిన వారి వివరాలను తొలగించడం, ఒకే పేరుతో రెండు చోట్ల ఉన్న నకిలీ ఓట్లను ఏరివేయడమే ఈ ఇంటింటి ఓటర్ల సర్వే ముఖ్య ఉద్దేశం. అయితే, ఈ ప్రభుత్వ అధికారిక ప్రక్రియను ఒక అద్భుతమైన రాజకీయ అవకాశంగా మార్చుకునేందుకు భారతీయ జనతా పార్టీ సర్వసన్నద్ధమైంది. గతంలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో అత్యంత విజయవంతమైన ఫలితాలను ఇచ్చిన మైక్రో-లెవెల్ మేనేజ్‌మెంట్ ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ అమలు చేసేందుకు కమలనాథులు పక్కా స్కెచ్ వేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ అధిష్టానం, రాష్ట్రంలోని జిల్లాలను ఆరు జోన్లుగా విభజించింది. ఎన్నికల నిర్వహణ, సమన్వయాన్ని సులభతరం చేసేందుకు ఒక్కో జోన్ పరిధిలోకి దాదాపు 7 జిల్లాలు వచ్చేలా ప్లాన్ చేశారు. పార్టీలోని కీలక నేతలకు ఒక్కొక్కరికి 7 జిల్లాల చొప్పున పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. కేవలం పైస్థాయి ప్రకటనలకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్క కార్యకర్త క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.ప్రభుత్వ బూత్ లెవెల్ అధికారులు ఇళ్లకు వెళ్ళినప్పుడు, వారితో పాటు బీజేపీ బూత్ లెవెల్ ఏజెంట్స్ కూడా ప్రతి ఇంటినీ సందర్శించనున్నారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి.. అందులో పార్టీ మద్దతుదారులు ఎవరున్నారు, తటస్థంగా ఉన్న ఓటర్లు ఎవరు అనే అంశాలపై స్పష్టమైన మార్కింగ్ చేయనున్నారు. దీని ద్వారా ఏ బూత్‌లో పార్టీ బలం ఎంత ఉందనేదానిపై ఒక కచ్చితమైన అంచనాకు రానున్నారు. ముఖ్యంగా మరణించిన వారి ఓట్లతో పాటు, చొరబాటుదారుల ఓట్లను తొలగించడంపైనే తాము ప్రధానంగా ఫోకస్ పెట్టినట్లు బీజేపీ స్పష్టం చేస్తోంది.బీజేపీ ఎంచుకున్న ఈ క్షేత్రస్థాయి వ్యూహం తెలంగాణ అధికార పార్టీ కాంగ్రెస్తో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లోనూ తీవ్ర కలకలం రేపుతోంది. కాషాయదళం ప్రభుత్వ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ.. పథకం ప్రకారం తమ మద్దతుదారుల ఓట్లను అక్రమంగా తొలగించే ప్రయత్నం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఆరోపిస్తున్నారు. బీజేపీ మైక్రో-ప్లాన్‌ను తిప్పికొట్టేందుకు ఈ రెండు పార్టీలు కూడా తమ బూత్ లెవెల్ కార్యకర్తలను అప్రమత్తం చేసి, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. జూన్ 25 నుంచి క్షేత్రస్థాయిలో మూడు పార్టీల కార్యకర్తల మధ్య ఓటర్ల సర్వే వేదికగా గట్టి ఘర్షణ వాతావరణం నెలకొనే అవకాశం కనిపిస్తోంది.ఈ ఏడాది చివరిలో జరగబోయే ఉఊఓఅ ఎన్నికలపై ఈ సర్వే ప్రభావం ఎలా ఉండబోతోందనే ప్రశ్నే ఇప్పుడు ప్రధాన పార్టీలను తొలిచేస్తోంది. హైదరాబాద్ మున్సిపల్ పరిధిలో స్థానిక జనాభాతో పాటు వలస వచ్చిన వారి సంఖ్య చాలా ఎక్కువ. ఎస్ఐఆర్ ద్వారా సేకరించే డేటాను విశ్లేషించి, ఏయే డివిజన్లలో ఏ వర్గాల ఓటర్లు బలంగా ఉన్నారో ముందే గుర్తించడం ద్వారా అభ్యర్థుల ఎంపికను వేగవంతం చేయా లని బీజేపీ భావిస్తోంది. ఎస్ఐఆర్ ను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మార్చుకుంటూ, అటు సంక్షేమంపై అధికార కాంగ్రెస్‌ను నిలదీస్తూనే, ఇటు క్షేత్రస్థాయి సమీకరణాలను తనకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. జూన్ 25 నుంచి నెల రోజుల పాటు సాగనున్న ఈ 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ పూర్తయ్యాక, గ్రేటర్ మున్సిపల్ రాజకీయం ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

# ఇక రణమే.... భగీరథ్ చిచ్చు



**హైదరాబాద్ :** తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలున్నాయి. అయితే బీజేపీ ? బీఆర్ఎస్ ఒక్కటేనని అధికార కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ ఆరోపిస్తూ వస్తోంది. ఆ రెండు పార్టీల మధ్య తెరవెనుక పొత్తు ఉందని చెప్తూ వచ్చింది. అయితే ఇప్పుడు అలాంటి ఊహాగానాలకు తెరపడింది. బండి భగీరథ్ కేసు వ్యవహారం ఆ రెండు పార్టీల మధ్య గ్యాప్ పెంచేసింది. భగీరథ్‌పై నమోదైన కేసు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్రంలో పొత్తుల సమీకరణాలను మార్చేసినట్లు అర్థమవుతోంది. ఢిల్లీ పెద్దలపై ఈగ వాలనివ్వకుండా కేవలం రాష్ట్ర స్థాయి నేతలనే టార్గెట్ చేస్తూ వస్తున్న గులాబీ బాసులు.. ఒక్కసారిగా రూట్ మార్చారు. తాజా పరిణామాలతో తెలంగాణ పీఠం కోసం పక్కాగా త్రిముఖ పోరు ఖాయమనే విషయం స్పష్టమైంది.బండి భగీరథ్ ఉదంతాన్ని ఒక సాధారణ లీగల్ ఇష్యూగా వదిలేయడానికి బీఆర్ఎస్ అస్సలు సిద్ధపడలేదు. దొరికిన అస్త్రాన్ని పదునుపెట్టి కమలనాథుల గుండెల్లో దింపింది. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రిమండలి నుంచి బర్తరఫ్ చేయాలంటూ స్వయంగా కేటీఆర్ రంగంలోకి దిగడం, రాష్ట్రవ్యాప్తంగా గులాబీ కేడర్ రోడ్లపైకి వచ్చి నిరసనలతో హోరెత్తించడం చూసి బీజేపీ మైండ్ బ్లాంక్ అయింది. తమతో సయోధ్య, గియోధ్య లాంటి ముచ్చట్లేవీ లేవని, అవకాశం దొరికితే చట్టపరమైన ఉచ్చులతో రాజకీయ సమాధి కట్టడానికి బీఆర్ఎస్ ఎంతకైనా తెగిస్తుందనే చేదు నిజం ఢిల్లీ పెద్దలకు ఈ దెబ్బతో అర్థమైంది.ఈ దెబ్బతో బీజేపీ అధిష్టానం తన సాఫ్ట్ కార్నర్ వ్యూహాన్ని చెత్తబుట్టలో పారేసింది. ఇప్పటివరకు బీఆర్ఎస్ పట్ల ప్రదర్శిస్తూ వచ్చిన వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టాలని ఢిల్లీ బాసులు డిసైడ్ అయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్న కమలదళం.. తన నెక్స్ట్ మెయిన్ టార్గెట్‌గా తెలంగాణను ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. బెంగాల్ తరహాలోనే ఇక్కడ కూడా ప్రత్యర్థులను తుడిచిపెట్టే అగ్రెసివ్ పాలిటిక్స్‌కు తెరలేపింది. బీఆర్ఎస్ వేసిన రివర్స్ గేర్ కమలనాథులను మరింత రెచ్చగొట్టడంతో.. ఇక గులాబీ పార్టీని క్షేత్రస్థాయిలో నామరూపాలు లేకుండా చేయడమే ఏకైక ఎజెండాగా బీజేపీ తన అసలైన రాజకీయ వేట ప్రారంభించబోతున్నట్టు సమాచారం. బండి భగీరథ్ పోక్సో కేసు సెగలు కాస్త చల్లబడటమే ఆలస్యం.. బీఆర్ఎస్ పై బీజేపీ ప్లాన్ అమలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.మొత్తానికి బండి భగీరథ కేసు కేవలం ఒక వ్యక్తిగత వివాదంగా మిగిలిపోలేదు. తెలంగాణ భవిష్యత్తు పొత్తుల పటాన్ని, పొలిటికల్ రూట్ మ్యాప్‌ను మార్చేసిన ఒక బిగ్గెస్ట్ టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఇకపై ఎలాంటి లోపాయికారీ పొత్తులకు ఛాన్స్ ఉండకపోవచ్చు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒంటరిగానే రణరంగంలోకి దూకడం పక్కాగా కనిపిస్తోంది.

## గడ్డిఅన్నారం అభివృద్ధికి ఎంపీ ఈటలకు వినతి..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్, మే 21, న్యూస్ ఇండియా ప్రతినిధి:**నాగోల్‌లో నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశంలో గడ్డిఅన్నారం డివిజన్ అభివృద్ధి పనులపై మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఎంపీ ఈటల రాజేందర్ కు వినతిపత్రం అందజేశారు. గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో జరిగిన సమావేశానికి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు కమిషనరేట్ కమిషనర్ సుమతి, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గడ్డిఅన్నారం డివిజన్‌లో సీసీ రోడ్లు, స్టార్మ్ వాటర్ నాలాలు, హైమాస్ట్ లైట్లు, కమ్యూనిటీ హాళ్లు, ఫుట్‌పాత్‌లు, కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కోరారు. అలాగే రూ.20 కోట్లతో న్యూ గడ్డిఅన్నారం కాలనీ నుంచి మూసి వరకు అభివృద్ధి పనులు, రూ.8 కోట్లతో కమలానగర్ వైభవ్ టిఫిన్ సెంటర్ నుంచి చైతన్యపురి నాలా వరకు పనులను వెంటనే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ సంబంధిత అధికారులతో సమావేశంలోనే చర్చించి, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జోనల్ కమిషనర్ కూడా సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# చెక్ పోస్ట్ తనిఖీ చేసిన ఎస్పీ



**భద్రాద్రి కొత్తగూడెం(న్యూస్ ఇండియా ప్రతినిధి) మే 21** :రాబోయే బక్రీద్ పండుగ దృష్ట్యా పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి,శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల నాగారం వద్ద ఏర్పాటు చేసిన చెక్పోస్టును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా చెక్పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.పండుగ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.ముఖ్యంగా ఇతర ప్రాంతాల సరిహద్దుల నుండి జరిగే పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని,నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాత్రి సమయాలలో విధులు నిర్వహించు సిబ్బంది డ్రాగన్ లైట్, బ్యాటన్ క్యారీ చెయ్యాలని, రిఫ్లెక్టివ్ జాకెట్స్ ధరించాలని, బారికేట్స్ ను ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించారు. వాహన తనిఖీ సమయాలలో వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత పత్రాలను చెక్ చేయాలని,ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 ద్వారా తెలియజేయాలని కోరారు.ఎవరూ కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదు.ఎవరైనా చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# వృద్ధురాలు అదృశ్యం..



**రంగారెడ్డి జిల్లా, ఎల్బీనగర్ మే 21, న్యూస్ ఇండియా ప్రతినిధి:**నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధురాలు అదృష్టమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జైపురి కాలనీలో నివాసముంటున్న జనాబాయి (82) అనే వృద్ధురాలు అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఈ నెల 16న మధ్యాహ్నం ఇంటి ముందు కూర్చున్న ఆమె అనంతరం కనిపించకుండా పోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు. బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్

**ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కార్మికుల సంఖ్యను పెంచాలి**

**పనిస్థలాల్లో ఉపాధి హామీ కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి - కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం (న్యూస్ ఇండియా ప్రతినిధి) మే 21** :లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న ఏం ఐ ట్యాంక్ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పరిశీలించారు. గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లిన కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి వారికి వేతనాలు సకాలంలో అందుతున్నాయా, పనుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పనిస్థలాల్లో కార్మికులకు తాగునీరు, నీడ కోసం టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పని సమయంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఆక్టివ్ జాబ్ కార్డుల వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం 300 జాబ్ కార్డులు ఉండగా ప్రస్తుతం 146 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నారని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ఉపాధి హామీ పనులపై గ్రామస్థులకు మరింత అవగాహన కల్పించి అర్హులైన ప్రతి కుటుంబం నుంచి ఎక్కువ మంది పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కార్మికుల సంఖ్యను పెంచి గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు మరింత విస్తరించేలా చూడాలని ఆదేశించారు.అనంతరం కలెక్టర్ మాస్టర్ కార్డు లు పరిశీలించి ఒక కుటుంబం నుంచి ఎంతమంది పనులకు వస్తున్నారు, పని దినాలు సక్రమంగా నమోదవుతున్నాయా అనే అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, ప్రతి కార్మికుడి హాజరు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.

ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని, నీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ పనులను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో కల సర్పంచ్ కంగాల అంజలి ,డిఆర్డిఓ విద్యాచందన, తాసిల్దార్ శిరీష, పంచాయతీ సెక్రటరీ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బయ్యారంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



**న్యూస్ ఇండియా తెలుగు మే 21**. మహబూబాబాద్ జిల్లా బయ్యారం:..మాజీ ప్రధాని,భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా బయ్యారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బయ్యారం,జగ్గుతండా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు గుగులోత్ శాంతి కిషన్ నాయక్,బొల్లి జయంతి వెంకటకృష్ణ పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం మాజీ టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ,మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంబాల ముసలయ్య మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేసిన దార్శనిక నాయకుడిగా రాజీవ్ గాంధీ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు.విద్య,సాంకేతికత, గ్రామీణాభివృద్ధి,ఆర్థిక రంగాల్లో ఆయన తీసుకొచ్చిన మార్పులు దేశ ప్రగతికి మూలస్తంభాలుగా నిలిచాయని పేర్కొన్నారు.ఐటీ రంగానికి పునాది వేసి, టెలికమ్యూనికేషన్ విప్లవానికి నాంది పలికిన నాయకుడిగా రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వామ్యాన్ని పెంచారని గుర్తుచేశారు.బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సంస్కరణలు నేటికీ ఆదర్శప్రాయమని,ఆధునిక భారత నిర్మాణంలో ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కిషన్ నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బయ్యారం ఉపసర్పంచ్ ఎనుగుల ఉమా రంజిత్,జగ్గుతండా ఉపసర్పంచ్ గుంజ వీరాస్వామి,వార్డు సభ్యులు ఎట్టి సరీత,మాజీ జిల్లా కార్యాదర్శి ములుకురి వీరారెడ్డి,కిసాన్ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి, పెద్దినేని వెంకటేశ్వరరావు,జగ్గుతండా వార్డుసభ్యులు గంద్రాతి యాకేష్, ఈసం పావని,మక్కల దుర్గరావు, రాఘవేంద్ర,మహబూబాబాద్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కొండపల్లి లక్ష్మి,తగిర సత్తిరెడ్డి,నందగిరి భద్రయ్య,తాటి జనార్ధన్,రామగిరి వెంకటేశ్వర్లు,తునికిపాటి క్రాంతి,నందిపాటి బవాణి,ఆకునూరి సూర్యనారాయణ,పెద్ద బుజ్జి,పులి మల్లయ్య,ఎలుగోటి సునీల్,సైదులు, చల్ల గోవర్ధన్,బీమనపల్లి యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు తిప్పలు

**తూకం వేసిన వడ్లను 24 గంటలలో మిల్లుకు తరలించాలి**

**బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్**

**న్యూస్ ఇండియా (టేక్మాల్ రిపోర్టర్ జైపాల్ మే 21)** మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో యాసంగి ధాన్యం కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్ తీవ్రంగా విమర్శించారు.

బుధవారం ఆయన మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమైన అంశాలు:

కొనుగోలు కేంద్రంల వద్ద..రోడ్లపై వడ్ల కుప్పల వద్ద రాత్రింబవళ్లు రైతుల పడిగాపులు కాస్తున్నారు వానాకాలం సాగుకు సిద్ధం చేసుకోవలసిన సమయంలో రైతులు ధాన్యం అమ్ముకోలేక కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.సెంటర్లు ఓపంచేయడమే కాదు వడ్లు మిల్లులకు వెళ్ళేవిదంగా చూడండి.

లారీల కొరత: తూకం చేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడానికి లారీలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

4. అధికారుల పర్యవేక్షణ లోపం: కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.రైతుల సమస్యలు పరిష్కరించడం లేదని ఆయన ఎద్దేవా చేశారు.

డిమాండ్లు:

1. ధాన్యం కొనుగోలును వెంటనే వేగవంతం చేయాలి.
2. తూకం చేసిన ధాన్యాన్ని 24 గంటల్లో మిల్లులకు తరలించాలి.
3. రైతులకు ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధర చెల్లించాలి.

ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలు




పరిష్కరించకపోతే, రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని నాయికోటి భాస్కర్ హెచ్చరించారు.

# టీఆర్‌డీసీ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు..

**రంగారెడ్డి జిల్లా, తుర్కయంజాల్, మే 21, న్యూస్ ఇండియా ప్రతినిధి:**జీహెచ్ఎంసీ ఆదిబట్ల సర్కిల్, శంషాబాద్ జోన్ తొర్రూర్ డివిజన్ నెం.53 కాంగ్రెస్ అధ్యక్షుడిగా కోశిక ఐలయ్య, తుర్కయాంజల్ డివిజన్ నెం.56 అధ్యక్షుడిగా ఓర్సు శ్రీనివాస్ నియమితులైన సందర్భంగా మల్ రెడ్డి రామ్ రెడ్డి ను ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీఆర్‌డీసీ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యాదగిరి, కొంతం వెంకట్ రెడ్డి, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# రాజీవ్ గాంధీ సేవలు మరియు ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం



**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)**
దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు రాజీవ్ గాంధీ
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గౌ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో టెక్స్టైల్ పార్కు అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయి
దాదాపు 60 లక్షలతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ స్టాచు మరియు పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి
గురువారం గీసుగొండడ సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ పరిధిలోని రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో కూడా నిధులు దాదాపు 60 లక్షలతో నిర్మించనున్న రాజీవ్ గాంధీ స్టాచు మరియు పార్క్ అభివృద్ధి పనులకు కూడా చైర్మన్ శ్రీ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, ఎంపీ శ్రీమతి కడియం కావ్య, నర్సంపేట ఎమ్మెల్యే శ్రీ దొంతి మాధవరెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి,మాజీ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీ ఆయుబ్,జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద తో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు,దేశ ఐక్యత, సమగ్ర అభివృద్ధి కోసం రాజీవ్ గాంధీ నిరంతరం పనిచేశారు అన్నారు.కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో భూముల కోల్పోయిన భూ నిర్వాసితులకు రుణపడి ఉంటాము అని, రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో మెరుగైన వసతులతో కూడిన ఆధునిక మోడల్ కాలనీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో కూడా నిధులు దాదాపు 60 లక్షలతో స్టాచు, పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని టెక్స్టైల్ పార్క్ పనులను వేగవంతం చేశారన్నారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారాన్ని అడ్డుపెట్టుకొని చరిత్రను తిరగరాసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రాజీవ్ గాంధీ కుటుంబం త్యాగ కుటుంబం అని, దేశ సమగ్రతకు, సమానత్వానికి పోరాటం చేశారన్నారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పర్యటన అనంతరం భూ నిర్వాసితులకు గృహ నిర్మాణం కోసం 863 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లను మంజూరు చేసారన్నారు.కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో రాజీవ్ గాంధీ టౌన్ షిప్ లో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం, వెటర్నరీ ఆసుపత్రి, సీసీ రోడ్లు, కల్వర్టు నిర్మాణం, 11 కె.వి 3 ఫేజ్ 5 వైర్ ఎల్టీ లైన్స్, కొత్త ఎం ఎస్ ఎం ఈ క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

## మామునూరు ఓపెన్ ఎయిర్ జైల్లో. "లీగల్. ఎయిడ్ హెల్ప్ డిస్క్ " ను. ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**వరంగల్ సిటీ బ్యూరో. న్యూస్ ఇండియా ప్రతినిధి. (రవీందర్)**వరంగల్ జిల్లా లిమామునూరు ఓపెన్ ఏయిర్ జైలులో 'లీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్' ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబలి
ఈ కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ "
ఈ హెల్ప్ డెస్క్ ఖైదీలకు చట్టపరమైన సహాయాన్ని మరింత వేగంగా మరియు సులభంగా అందించే లక్ష్యంతో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి కారాగారంలో లిలీగల్ ఎయిడ్ హెల్ప్ డెస్క్'లి ను ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.
ములాఖత్ ప్రక్రియ సరళీకరణ జైలుకు వచ్చే మీ కుటుంబ సభ్యులు, బంధువుల "ములాఖత్" ప్రక్రియను సులభతరం చేయడం ఈ డెస్క్ ప్రాథమిక విధిగా తెలిపారు. ములాఖత్ కోసం వచ్చే సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, నిబంధనలపై ఇక్కడ అవగాహన కల్పిస్తారు. ఖైదీలను కలవడానికి వచ్చే వారికి అవసరమైన చట్టపరమైన సహాయం మరియు మార్గదర్శకత్వం ఇక్కడ లభిస్తుంది అని తెలిపారు. ఈ హెల్ప్ డెస్క్ ద్వారా అర్హులైన ప్రతి ఖైదీకి ఉచితంగా లీగల్ అడ్వైజ్ (న్యాయ సలహాలు) అందించడం జరుగుతుంది అని సూచించారు.
ప్రైవేట్ న్యాయవాదులను పెట్టుకోలేని వారి కోసం ప్రభుత్వ ఖర్చులతో ప్యానెల్ లాయర్లను కేటాయించే బాధ్యతను ఈ డెస్క్ తీసుకుంటుంది అని వివరించారు.
బెయిల్ మరియు కేసుల అప్‌డేట్స్, కేసుల ప్రస్తుత స్థితి (ఝుంవ ర్ఫ్‌బం), బెయిల్ పిటిషన్ల దాఖలు, మరియు కోర్టు ఆదేశాల గురించిన సమాచారాన్ని ఇక్కడి లీగల్ ఎయిడ్ వాలంటీర్లు మీకు అందిస్తారు.
చట్టం ముందు అందరూ సమానులే. జైలులో ఉన్నంత మాత్రాన మీ ప్రాథమిక హక్కులు కోల్పోయినట్లు కాదు. ఈ హెల్ప్ డెస్క్‌ను ఒక గొప్ప అవకాశంగా భావించి, మీ సమస్యల పరిష్కారానికి దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ టి.కళాసాగర్, డిప్యూటి సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వర స్వామి, డిప్యూటి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాసరావు, జైలర్ కె.పూర్ణచందర్, డిప్యూటి జైలర్లు కె.శ్రీనివాస్, యం.సుధాకర్ రెడ్డి మరియు ఖైదీలు పాల్గొన్నారు.



# విశాఖ ఫార్మసిటీలో ముగిసిన డాక్టర్ పి.పి . లాల్ కృష్ణ ప్రస్థానం.






### రెండున్నర దశాబ్దాల పాటు విశాఖ ఫార్మాసిటీ అభివృద్ధికి విశేష కృషి.

### పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపిన వివిధ ఫార్మా పారిశ్రామికవేత్తలు.

**పరవాడ న్యూస్ ఇండియా ప్రతినిధి.**విశాఖ ఫార్మాసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి పి లాల్ కృష్ణ శకం ముగిసింది. దాదాపు రెండున్నర దశాబ్దాలు పాటు విశాఖ ఫార్మాసిటీ అభివృద్ధికి లాల్ కృష్ణ చేసిన కృషిని కొనియాడక తప్పదు. విశాఖ ఫార్మా సిటీ బ్రిడ్జ్ గోపాల్ సంస్థతో మూడు నెలల క్రితం ఎంవోయూ కుదుర్చుకున్న విషయం బహిరంగ రహస్యం. దీనిలో భాగంగా గురువారం ఎంఓయు కుదుర్చుకున్న నూతన సంస్థ ఆదేశాల మేరకు లాల్ కృష్ణ పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా వివిధ పారిశ్రామికవేత్తలు లాల్ కృష్ణకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ ఫార్మాసిటీ అభివృద్ధికి లాల్ కృష్ణ చేసిన సేవలను ఈ సందర్భంగా ఫార్మా పారిశ్రామిక వేత్తలు కొనియాడారు. సుమారు 2800 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పడిన జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ప్రస్తుతం 100 కి పైగా సంస్థలు ఉత్పత్తులను ప్రారంభించాయంటే అది లాల్ కృష్ణ చూపిన చొరవే కారణం అని కొనియాడారు. ప్రారంభ దశలో జేఎన్పిసి పార్కు కి ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ కరోనా వంటి విపత్కర పరిస్థితులను సైతం ఎదుర్కొని జెఎన్పిసి లోని సంస్థలు నిలదొక్కున్నాయి అంటే వాటి వెనక లాలకృష్ణ చేసిన కృషి అభినందనీయమని ఫార్మా ప్రతినిధులు ప్రశంసించారు. తాడి తరలింపు సమస్య, ద్రవ ఘన పదార్థాల ట్రీట్మెంట్ నిర్వహణ సమయంలో స్థానికుల ఆరోపణలు, ఫార్మా కాలుష్య సమస్య, నిర్వాసితుల సమస్యలు, నిర్వాసితుల ఉద్యోగ సమస్యలు ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సమస్యలను తనదైన శైలిలో లాల్ కృష్ణ పరిష్కరిస్తూ వివాద రహితుడిగ పేరు సంపాదించుకున్నారన్నారు. అధిక ఖర్చుతో కూడిన ఫార్మా ఉత్పత్తుల నాణ్యతలను పరీక్షించుకోవడానికి ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రయోగశాలలో ఆధారపడకుండా స్థానికంగానే అడ్వాన్సుడ్ అనిటికల్ సొల్యూషన్ ల్యాబ్ ను తీసుకొచ్చిన ఘనత లాల్ కృష్ణ కే దక్కుతుందన్నారు. జేఎన్పిసి పార్క్ దినధన అభివృద్ధికి లాల్ కృష్ణ చేసిన సేవలను మరువలేని వని ఈ సందర్భంగా ఫార్మా ప్రతినిధులు పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ కొనియాడారు. కార్యక్రమానికి ముందు ఫార్మా పారిశ్రామికవేత్తలు లాల్ కృష్ణకు సాల్వాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేసి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బల్క్ డ్రగ్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ పరిశ్రమలకు చెందిన ఫార్మా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.





## సమస్యల పరిష్కారానికి కృషి చేయండి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ ఆర్ సాదు యాదవ్......



**కుత్బుల్లాపూర్ మే21 (న్యూస్ ఇండియా ప్రతినిధి)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లి 294 డివిజన్ పరిధిలోని పలు కాలనీలో డ్రైనేజీలు రోడ్ల సమస్యలు ఉన్నాయని ముఖ్యంగా స్మశాన వాటికలో బోరు స్నానాల గదులు షెడ్లు , సరైన వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డిప్యూటీ కమిషనర్ వెంకట మణి కిరణ్ ని కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది సమస్యల పరిష్కారానికై ఖచ్చితంగా కృషి చేస్తానని తెలియజేయడం జరిగింది.

## శ్రీ దత్త సాయి కి ప్రత్యేక పూజలు - భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం..





**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని ప్రముఖ ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ శ్రీ దత్త సాయి అన్నదాన సమాజము మరియు జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో వేంచేసి ఉన్న శ్రీ దత్త సాయి సన్నిధిలో ఈరోజు గురువారం పంచమి పునర్వసుల నక్షత్రం సందర్భంగా ప్రత్యేక అభిషేక అర్చన పూజా కార్యక్రమాలు జరిగి ఉన్నాయి. అనంతరం షిరిడీలో నిత్యాన్నదాన సత్రం దత్త సాయిరాం అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్ది రమేష్ సతీమణి లక్ష్మీ త్రివేణి పుట్టినరోజు సందర్భంగా దత్త సాయి సన్నిధిలో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. వారిని వారి కుటుంబాన్ని ఆ దత్త సాయి అనుగ్రహంతో ఆయురారోగ్య భోగభాగ్యాలతో తులతూగాలని ట్రస్ట్ సభ్యులు కోరారు. అనంతరం ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ పూసపాటి బాలాజీ మాట్లాడుతూ.. అన్నం పరబ్రహ్మ స్వరూపమని అటువంటి పరబ్రహ్మస్వరూపాన్ని ఎవరైతే ఆకలిగా ఉన్నవారికి అందజేస్తారో వారికి ఆయురారోగ్య భోగభాగ్యాలు కలుగుతాయని, ఈరోజు గురువారం పంచమి పునర్వసు నక్షత్రం పునర్వసు నక్షత్రానికి అధిపతి గురువు అటువంటి గురువారం గురువు నక్షత్రం కలిసిన పరమ పవిత్రమైన రోజున ఏ చిన్న కార్యక్రమం చిన్న అన్నదాన కార్యక్రమం చేసిన అది అఖండ ఫలితాన్ని ఇస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు అయినవోలు హనుమంతరావు మేకపోతుల వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.ద

## ఘనంగా రాజీవ్ గాంధీ 35 వ వర్ధంతి.



**నర్సీపట్నం న్యూస్ ఇండియా ప్రతినిధి.:**మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని పురస్కరించుకుని
నర్సీపట్నం పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు.
నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలోని అభీద్ సెంటర్ లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నందిన రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు రాజీవ్ గాంధీ దేశాభివృద్ధికి, ఆధునిక సాంకేతిక రంగానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో కంప్యూటర్, టెలికాం విప్లవానికి నాంది పలికిన రాజీవ్ గాంధీ, యువతకు ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు మీసాల సుబ్బన్న, అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బొంతు రమణ, జిల్లా జనరల్ సెక్రటరీ, మండల పార్టీ అధ్యక్షులు చింతల సన్యాసిరావు, జిల్లా కార్యదర్శి శేషు, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శివ, రాజన్న రాజా, అధికారి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రియతమ నేతకు ఘనంగా నివాళులర్పించారు.

## సంపాదకీయం

# హిస్టరీ రిపీట్!?

కరేబియన్ సముద్రం మరోసారి ఉద్రిక్తతల వేదికైంది. అమెరికా తన అత్యంత శక్తిమంతమైన విమాన వాహక నౌకల్లో ఒకటైన యూఎస్ఎస్ నిమిట్జ్‌ను, దాని పూర్తి స్థాయి స్ట్రైక్ గ్రూప్‌తో సహా క్యూబా తీరానికి సమీపంలోని కరేబియన్ జలాల్లోకి తరలించింది. ఈ స్ట్రైక్ గ్రూప్‌లో ఎఫ్/ ఏ-18ఈ సూపర్ హార్నెట్‌లు, ఈఏ-18జీ గ్రౌలర్‌లు, సీ-2ఏ గ్రేహౌండ్‌లతో కూడిన ఎయిర్ వింగ్‌తోపాటు యూఎస్ఎస్ గ్రిడ్లీ డెస్ట్రాయర్, యూఎస్ఎన్ఎస్ పటక్సెంట్ నౌకలున్నాయి. ఈ మోహరింపును దక్షిణ కమాండ్ (సదరన్ కమాండ్) స్వయంగా ప్రకటించడం ద్వారా అమెరికా తన ఉద్దేశాన్ని దాచుకోవడం లేదని స్పష్టమవుతోంది. వెనెజువెలాపై దాడి సమయంలోనూ, పశ్చిమాసియాలో ఇరాన్‌తో ఘర్షణ సమయంలోనూ ఇదే తరహాలో ముందుగా నౌకలను మోహరించిన చరిత్ర వాషింగ్టన్‌కు ఉంది. కాబట్టి ఇది కేవలం యాదృచ్ఛిక విన్యాసం కాదని అంతర్జాతీయ వ్యవహారాల పరిశీలకులు భావిస్తున్నారు. వాస్తవానికి ఈ నౌక 'సదరన్ సీస్ 2026' అనే వార్షిక విన్యాసంలో భాగంగా దక్షిణ అమెరికా చుట్టూ పర్యటిస్తోంది. పైగా ఇది నిమిట్జ్ నౌక చివరి సముద్రయానం కూడా. అయినా దాని ఉనికి కేవలం సాధారణ విన్యాసాన్ని మించిన రాజకీయ, వ్యూహాత్మక సందేశాన్ని హవానాకు పంపుతోందనడంలో సందేహం లేదు. ఇదే సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్యూబా తమ 'మనసులో ఉంది' అంటూ చేసిన వ్యాఖ్యలు.. ఆ ద్వీపంపై దాడి చేస్తామన్న బెదిరింపులు.. పరిస్థితిని అంచనా వేయడానికి అద్దంపట్టే అంశాలు. జనవరిలో వెనెజువెలా అధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా బలగాలు నిర్బంధించిన దగ్గర్నుంచీ.. మిత్రదేశం క్యూబాపై ఒత్తిడి పెరుగుతోంది. చిన్న ద్వీప దేశంపై అత్యంత శక్తిమంతమైన సైనిక యంత్రాంగం ఇంత దృష్టి సారించడం -శతాబ్దానికిపైగా సాగుతున్న పాత వైరానికి కొత్త అధ్యాయం!

ఈ ఉద్రిక్తతను అర్థం చేసుకోవాలంటే చరిత్రను తిరగేయాలి. 1950ల చివర వరకు క్యూబాలో అమెరికా అండతో పాలించిన నియంత ఫుల్‌జెన్సియో బటిస్టా సామ్రాజ్యాన్ని ఫిడెల్ క్యాస్ట్రో, ఆయన సోదరుడు రౌల్ క్యాస్ట్రో నేతృత్వంలోని గెరిల్లా ఉద్యమం కూల్చివేసింది. 1959 జనవరి 1న బటిస్టా పారిపోవడంతో విప్లవం విజయవంతమైంది. అప్పటినుంచీ వాషింగ్టన్‌కు, హవానాకు మధ్య బద్ధవైరం మొదలైంది. 1961లో సీఐఏ మద్దతుతో జరిగిన 'బే ఆఫ్ పిగ్స్' దురాక్రమణ ప్రయత్నం ఘోర పరాజయం పాలైంది. 1962లో క్యూబా క్షిపణి సంక్షోభం ప్రపంచాన్ని అణుయుద్ధం అంచుకు తీసుకెళ్లింది. ఆరు దశాబ్దాల ఆర్థిక దిగ్బంధనం, గ్వాంటనామో బే నౌకాస్థావరం ఆక్రమణ.. ఇవన్నీ ఆ చారిత్రక ఘర్షణకు సజీవ సాక్ష్యాలు. ఆ చారిత్రక నీడే.. తాజా ఉద్రిక్తతకు కారణం! 1996లో మియామీ కేంద్రంగా పనిచేసే 'బ్రదర్స్ టు ద రెస్క్యూ' సంస్థకు చెందిన రెండు పౌర విమానాలను క్యూబా కూల్చివేసిన ఘటనలో నలుగురు మరణించారు. ఆ సమయంలో రక్షణ మంత్రిగా ఉన్న రౌల్ క్యాస్ట్రోపై ఇప్పుడు అమెరికా న్యాయ శాఖ హత్యానేరాభియోగాలు నమోదు చేయడం.. అదీ క్యూబా స్వాతంత్ర్య దినోత్సవం రోజునే అభియోగపత్రాన్ని బహిర్గతం చేయడం.. ఇది యాదృచ్ఛికమైతే కాదు, ఒక లెక్కగట్టిన రాజకీయ సందేశం! ఈ ఒత్తిడికి మరో కోణముంది. అమెరికా నిఘా వర్గాల అంచనా ప్రకారం, క్యూబా 2023నుంచి రష్యా, ఇరాన్‌లనుంచి 300కు పైగా సైనిక డ్రోన్‌లను సేకరించింది. గ్వాంటనామో, కీ వెస్ట్, అమెరికా నౌకలపై వీటిని ఉపయోగించే అవకాశాలను చర్చిస్తోంది. అయితే ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని గమనించాలి. క్యూబా తక్షణ ముప్పుగా మారిందని, దాడికి సన్నద్ధమవుతోందని తాము భావించడం లేదని, ఒకవేళ ఘర్షణ తలెత్తితే అన్న ఊహతో మాత్రమే ఆ దేశం డ్రోన్ యుద్ధతంత్రాన్ని చర్చిస్తోందని అమెరికా అధికారులే అంగీకరించారు. అంటే ఈ నిఘా సమాచారం సైనిక చర్యకు ఒక సాకు అన్నది స్పష్టం. ట్రంప్ యంత్రాంగంలో క్యూబా-అమెరికన్ అయిన విదేశాంగ మంత్రి మార్కో రూబియో కీలక పాత్ర పోషిస్తుండటం, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ స్వయంగా హవానా వెళ్లి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రద్దు చేసుకోవాలని హెచ్చరించడం.. ఇవన్నీ కలిసి, పశ్చిమాసియాలో ఇరాన్‌తో ఘర్షణ తర్వాత తన ప్రతిష్ఠను పునరుద్ధరించుకోవాలని చూస్తున్న వాషింగ్టన్ ఇప్పుడు తన పెరట్లోనే ఒక సులభమైన లక్ష్యాన్ని ఎంచుకుందా అన్న అనుమానాన్ని బలపరుస్తున్నాయి. జనవరి నుంచి 240కి పైగా ఆంక్షలు, చమురు ట్యాంకర్ల అడ్డగింపు, మే 1న శక్తి-రక్షణ రంగాలపై విస్తరించిన ఆంక్షల ఉత్తర్వు.. ఈ క్రమబద్ధమైన ఒత్తిడి విధానం, దౌత్యంకంటే లొంగదీసుకోవడమే లక్ష్యమన్న భావనను కలిగిస్తోంది.

చరిత్ర చెప్పే పాఠం ఒక్కటే -క్యూబాను బలప్రయోగంతో లొంగదీసుకునే ప్రయత్నాలు గతంలో ఎప్పుడూ ఫలించలేదు. 'బే ఆఫ్ పిగ్స్' నుంచి దశాబ్దాల దిగ్బంధనం వరకు, ఒత్తిడి ఆ చిన్న దేశం పట్టుదలను మరింత బలోపేతం చేసిందే తప్ప భయపెట్టలేదు. అమెరికా ఆరోపణలను క్యూబా అధికారులు తోసిపుచ్చడం, ఏ దేశమైనా బాహ్య దురాక్రమణ నుంచి తనను తాను రక్షించుకునే హక్కు తనకు ఉందని హవానా స్పష్టం చేయడం.. ఈ ధిక్కారమే వాషింగ్టన్‌లో అసహనాన్ని పెంచుతోంది. ఒక సార్వభౌమ దేశ ప్రభుత్వాన్ని కూల్చడం, దాని నాయకులపై దశాబ్దాల నాటి ఘటనలను తవ్వి నేరాభియోగాలు మోపడం, తీరానికి నౌకలను తరలించడం.. ఇవి అంతర్జాతీయ చట్టం, సార్వభౌమత్వ సూత్రాల దృష్ట్యా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతాయి. డ్రోన్ల ముప్పు నిజమే అయినా, దానిని పూర్తిస్థాయి సైనిక చర్యకు సాకుగా మార్చడం కరేబియన్ ప్రాంతం మొత్తాన్నీ అస్థిరపరిచే ప్రమాదాన్ని కలిగిస్తుంది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభం, విద్యుత్ కోతలతో సతమతమవుతున్న క్యూబా ప్రజలపై ఈ ఉద్రిక్తత భారం మరింత పెరగడం మానవీయ కోణంలో ఆందోళనకరం. ఇరాన్‌తో ఘర్షణ, వెనెజువెలాలో మదురో పట్టివేత తర్వాత ఇప్పుడు క్యూబా వంతు వచ్చిందా? అన్న ప్రశ్న ఈ ప్రాంతంలోని అనేక దేశాలను కలవరపెడుతోంది. బలప్రదర్శన కంటే నిజాయితీతో కూడిన దౌత్యమే శాశ్వత పరిష్కారాన్ని ఇస్తుంది. వాషింగ్టన్ తన చారిత్రక తప్పిదాలను పునరావృతం చేయకుండా, ఘర్షణ మార్గంనుంచి సంయమనం వైపు అడుగులు వేయాలని ప్రపంచం ఆశిస్తోంది. లేకుంటే -చరిత్ర మరోసారి తిరగబడి, శక్తిమంతుల అహంకారం ముందు చిన్న దేశాల ప్రతిఘటనే గెలుస్తుందన్న పాఠాన్ని కరేబియన్ సముద్రం మరోసారి నేర్పవచ్చు!

---

# కాక్రోచ్.. డిజిటల్ తిరుగుబాటా?




భారత రాజకీయ చరిత్రలో ఎన్నో పార్టీలు పుట్టాయి. కానీ ఒక పార్టీ పేరు "బొద్దింకల పార్టీ" అని ఉండటం, దానికి కొద్ది రోజుల్లోనే లక్షలాది యువత మద్దతు ప్రకటించడం బహుశా ఇదే మొదటిసారి. 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) పేరుతో సాగుతున్న సోషల్ మీడియా ప్రచారం ఒక సాధారణ జోక్‌గా మొదలై, కొన్ని గంటల్లోనే దేశవ్యాప్త చర్చనీయాంశంగా మారిపోయింది. ఈ వ్యవహారం వెనుక ఉన్నది ఒక న్యాయస్థానపు మాట. అదెలా ఒక డిజిటల్ ఉద్యమంగా మారిందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

**మొదలైంది ఒక కోర్టు హాల్‌లో**

2026 మే 15న సుప్రీంకోర్టులో ఒక కేసు విచారణ జరుగుతోంది. సీనియర్ న్యాయవాదుల హోదా కల్పనకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఢిల్లీ హైకోర్టు అమలు చేయడంలో జాప్యం జరిగిందంటూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం వాదనలు వింటోంది. ఆ సందర్భంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. "ఉద్యోగం దొరకని, ఏ వృత్తిలోనూ స్థానం లేని బొద్దింకల్లాంటి యువకులున్నారు. వారిలో కొందరు మీడియాగా, సోషల్ మీడియాగా, ఆర్టీఐ యాక్టివిస్టులుగా మారి అందరిపైనా దాడి చేయడం మొదలుపెడతారు" అని ఆయన అన్నట్టుగా మీడియాలో ప్రచారం జరిగింది. వ్యవస్థపై దాడి చేసే "పరాన్నజీవులు" ఉన్నారనే మాట కూడా ఆ విచారణలో వచ్చింది. ఈ వ్యాఖ్యలు ముఖ్యంగా జెన్ జెడ్ యువతలో ఆగ్రహాన్ని రగిల్చాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పెరిగిపోతున్న జీవన వ్యయం, మతపరమైన చీలికల మధ్య నలిగిపోతున్న తరం ఈ మాటలను తమపై అవమానంగా భావించింది. మరుసటి రోజు మే 16న జస్టిస్ సూర్యకాంత్ వివరణ ఇచ్చారు. మీడియాలోని ఒక వర్గం తన వ్యాఖ్యలను వక్రీకరించిందని ఆరోపించారు. తన మాటలు దేశ యువత గురించి కాదని, నకిలీ సర్టిఫికెట్లతో న్యాయవృత్తిలోకి ప్రవేశించిన వ్యక్తుల గురించి మాత్రమేనని, యువతను "అభివృద్ధి చెందిన భారతానికి మూలస్తంభాలు"గా చూస్తానని స్పష్టం చేశారు. కానీ అప్పటికే సోషల్ మీడియాలో "మేమూ బొద్దింకలే" అనే నినాదం వైరల్ అయిపోయింది.

ఈ ప్రచారానికి నాంది పలికింది 30యేళ్ల అభిజిత్ దీపక్. ప్రస్తుతం బోస్టన్ వర్శిటీలో పబ్లిక్ రిలేషన్స్ చదువుతున్న అతను, సీజేఐ వ్యాఖ్యలపై 'ఎక్స్'లో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. "భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడాల్సిన వ్యక్తే యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో ఎలా పోలుస్తారు?" అని ప్రశ్నించారు. "బొద్దింకలన్నీ ఏకమైతే ఏమవుతుంది?" అన్న ఆయన పోస్టుకు యువత నుంచి వచ్చిన స్పందనే.. డిజిటల్ ఉద్యమమైంది. 'మనమందరం ఏకమై ఒక వేదిక సృష్టించుకోవాలి' అన్న పిలుపే 'కాక్రోచ్ జనతా పార్టీ'కి బీజమైంది.

ఇక్కడ చమత్కారం ఏంటంటే -సీజేఐ యువతను అవమానించడానికి వాడిన పదాలనే అభిజిత్ పార్టీలో సభ్యత్వానికి అర్హతలుగా మార్చేశారు. "సోమరులు, నిరుద్యోగులు, నిరంతరం ఆన్‌లైన్‌లో ఉండేవారే" సభ్యత్వానికి అర్హులని ప్రకటించారు. పార్టీ నినాదాన్ని "సెక్యులర్, సోషలిస్ట్, డెమోక్రటిక్, లేజీ" (లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామ్య, బద్ధక) అని పెట్టారు. ఈ వ్యంగ్యం వేగంగా విస్తరించింది. గంటల్లోనే వేలాది జనాలు పేర్లు నమోదు చేసుకున్నారు. పార్టీకి ఒక వెబ్‌సైట్, మ్యానిఫెస్టో, చివరికి ఒక పార్టీ గీతం కూడా తయారయ్యాయి. స్థాపించిన నాలుగో రోజుకే రెండు లక్షలమందికి పైగా సభ్యత్వం కోసం నమోదు చేసుకున్నారని అభిజిత్ చెబుతున్నారు.

**యమునా ఒడ్డున యాంటెన్నాలతో...**

ఈ ప్రచారం ఆన్‌లైన్‌కే పరిమితం కాలేదు. ఢిల్లీలోని కాళిందీ కుంజ్ వద్ద యమునా ఒడ్డున కొందరు యువకులు తలపై కృత్రిమ బొద్దింక యాంటెన్నాలు ధరించి, "నేనొక బొద్దింకను" అని రాసిన ప్లకార్డులతో నది శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. "భారతీయ జెన్ జెడ్ తమ అసంతృప్తిని వ్యంగ్యాత్మక రూపంలో వ్యక్తం చేస్తోంది. వారు హింసను ప్రేరేపించడం లేదు" అని అభిజిత్ వ్యాఖ్యానించారు.

**ఎవరీ అభిజిత్ దీపక్?**

మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌కు చెందిన అభిజిత్, పుణెలో గ్రాడ్యుయేట్. తర్వాత కొన్నేళ్లు ఆమ్ ఆద్మీ పార్టీ కమ్యూనికేషన్ బృందంలో పనిచేశారు. ఉన్నత విద్య కోసం బోస్టన్ వర్శిటీలో చేరి ఇటీవలే పీజీ పూర్తి చేశారు. ఆసక్తికరమైన విషయమేంటంటే -ఈ ఉద్యమం ఎక్కువ కాలం నిలబడకపోవచ్చని అభిజిత్తే స్వయంగా అంగీకరిస్తున్నారు. "నాకు భ్రమలేం లేవు. ఇది కొన్ని రోజుల్లో సద్దుమణగవచ్చు" అని నిజాయితీగా చెప్పారు. అయినా ఇదొక ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో మరిన్ని యువజన సంస్థలు పుట్టుకొస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

**వ్యంగ్యం వెనుక గంభీరమైన డిమాండ్లు**

బొద్దింక జనతా పార్టీ మ్యానిఫెస్టో కేవలం హాస్యం కోసం రూపొందినది కాదు. న్యాయవ్యవస్థ స్వతంత్రతపై అభిజిత్ గట్టి అభిప్రాయం వ్యక్తం చేశారు. "నిష్పక్షపాతంగా ఉండాల్సిన న్యాయమూర్తులు పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందడాన్ని చూస్తున్నాం. న్యాయవ్యవస్థ కూడా ప్రభుత్వ ప్రభావంలో పడితే ప్రజాస్వామ్యాన్ని ఎవరు కాపాడతారు?" అని ప్రశ్నించారు. మహిళలకు 33 శాతం కాదు, ఏకంగా 50 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కూడా ఆయన సూచించారు.

**నేపాల్, శ్రీలంకలతో పోలికా?**

శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లలో యువత నిరసనలు ప్రభుత్వాలను సైతం పడగొట్టాయి. మరి భారత జెన్ జెడ్‌ను వీటితో పోల్చవచ్చా? "అలా పోల్చడం పెద్ద అవమానం. ఎందుకంటే భారత యువత హింసను ప్రేరేపించడం లేదు. వ్యంగ్యం ద్వారానే వ్యవస్థను ప్రశ్నిస్తోంది. ఈ తరం మన కేంద్ర మంత్రివర్గంకంటే ఎక్కువ విద్యావంతులు" అని అభిజిత్ ఘాటుగా వ్యాఖ్యానించారు. గణాంకాలు కూడా ఈ ఆందోళనకు అద్దం పడుతున్నాయి. భారత్ ఏటా 80 లక్షల మందికిపైగా గ్రాడ్యుయేట్లను ఉత్పత్తి చేస్తున్నా, వారిలో నిరుద్యోగిత రేటు దాదాపు 29 శాతంగా ఉంది.

**భవిష్యత్తు ఏంటి?**

ఈ ఉద్యమం కేవలం ఒక వ్యంగ్య ట్రెండ్‌గా మిగిలిపోతుందా? లేక నిజమైన మార్పుకు దారితీస్తుందా? అనేది ప్రస్తుతానికి ప్రశ్నే. అమెరికానుంచి భారత్‌కు తిరిగి వచ్చి ఈ ప్రచారాన్ని ముందుకు తీసుకువెళతానని అభిజిత్ చెప్పారు. "ఇకపై మనం నేపాల్, బంగ్లాదేశ్‌లతో కాకుండా ప్రపంచంలోని అత్యుత్తమ దేశాలతో మనల్ని పోల్చుకోవాలి. తమను బొద్దింకల్లా చూడటాన్ని భారత జెన్ జెడ్ ఇష్టపడటం లేదు" అన్నారు. ఈ ప్రభావం రాష్ట్రాల స్థాయికి చేరింది. 'కాక్రోచ్ జనతా పార్టీ తెలంగాణ' పేరుతో ఒక ఇన్‌స్టాగ్రామ్ పేజీ కూడా మొదలైంది. ఒక న్యాయమూర్తి నోటినుంచి వెలువడిన ఒకే ఒక్క పదం ఎలా ఒక తరం అసహనానికి ప్రతీకగా మారిందో ఈ ఉదంతం నిలువుటద్దం. నలిపేస్తే నశించని జీవి బొద్దింక. బహుశా ఆ పోలికే ఇప్పుడు ఆ యువతరానికి కొత్త అర్థాన్నిచ్చింది. "ఎంత తొక్కినా నిలబడతాం" అన్నట్టుగా. ■

---

## యువత కోసం..



# పోరాటం లేనిదే ప్రగతి లేదు!

"సంఘర్షణ లేని చోట ప్రగతికి తావుండదు". దాదాపు రెండు శతాబ్దాల క్రితం ఫ్రెడరిక్ డగ్లస్ చెప్పిన ఈ మాట, నేటి డిజిటల్ యుగంలో ఎదుగుదల కోసం తపించే ప్రతి ఒక్కరికీ ఒక దిక్సూచి!

మనం ఏదైనా సాధించాలనుకున్నప్పుడు ఎదురయ్యే ఆటంకాలను చూసి కుంగిపోతుంటాం. కానీ నిజమేంటంటే -ఆ ఆటంకాలే లేకపోతే, మనం సాధించే విజయానికి విలువే ఉండదు. కష్టం లేకుండా దొరికిన దానికి విలువ తెలియదు. పోరాడి గెలిచిన దానికే మధురమైన రుచి.

**బానిసనుంచి యోధుడిగా...**

ఫ్రెడరిక్ డగ్లస్ 1818లో అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఒక బానిసగా జన్మించారు. అక్షరం ముక్క రాని స్థితి నుంచి, తనంతట తానుగా చదువు నేర్చుకుని, 1838లో బానిసత్వ సంకెళ్లను తెంచుకుని పారిపోయారు. తర్వాత గొప్ప రచయితగా, వక్తగా, సంఘ సంస్కర్తగా ఎదిగారు. చివరకు అబ్రహం లింకన్‌వంటి నాయకులకే సలహాదారుగా నిలిచారు. మన దేశంలో జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌వంటి మహనీయులు అణచివేతపై గళమెత్తినట్టే, డగ్లస్ కూడా అన్యాయంపై ఎదురొడ్డి నిలిచారు. "దున్నకుండా పంటను ఆశించడం ఎంత తప్పో, పోరాటం చేయకుండా మార్పును కోరుకోవడం కూడా అంతే తప్పు" అని ఆయన నిక్కచ్చిగా చెప్పేవారు.

**సంఘర్షణే తొలిమెట్టు..**

1857లో ఇచ్చిన ఒక ప్రసంగంలో డగ్లస్ ఈ మాటలు చెప్పారు. అధికారం ఎప్పుడూ తనంతట తానుగా ఏ హక్కునూ వదులుకోదని, మనం అడిగితేనే, పోరాడితేనే ఫలితం దక్కుతుందని ఆయన హెచ్చరించారు. ఈ సూత్రం జీవితంలోని ప్రతి కోణానికీ వర్తిస్తుంది:

భయంపై విజయం సాధించాలంటే -సంఘర్షణ తప్పదు. వివక్షపై పోరాడితేనే -సమానత్వం సిద్ధిస్తుంది. అసౌకర్యంగా అనిపించే కొత్త విషయాలను నేర్చుకున్నప్పుడే -కెరీర్‌లో ముందడుగు పడుతుంది.


పాత పద్ధతులను వదిలి కొత్త వాటిని స్వీకరించేటప్పుడు కలిగే ఘర్షణే మనల్ని మరింత బలంగా తీర్చిదిద్దుతుంది. నిశ్శబ్దంగా ఉంటే శాంతి లభిస్తుందని అనుకోవడం పొరపాటు. అది కేవలం అణచివేతకు తలొగ్గడమేనని డగ్లస్ భావించారు.

**నేటి కాలానికి ఈ మాటలెలా సరిపోతాయి?**

నేటి వేగవంతమైన ప్రపంచంలో ఉద్యోగాలు, సాంకేతికత విపరీతంగా మారిపోతున్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2025' ప్రకారం, 2030నాటికి మార్కెట్‌లో అవసరమయ్యే నైపుణ్యాల్లో దాదాపు 39 శాతం మారిపోతాయని అంచనా. అంటే, కొత్త విషయాలను నేర్చుకోవడంలో మనం ఇప్పుడు పడే ఇబ్బందే రేపటి భవిష్యత్తుకు పునాది. మరోవైపు, గాలప్ సంస్థ సర్వే ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా కేవలం 20 శాతం ఉద్యోగులు మాత్రమే తమ పనిపట్ల ఉత్సాహంగా ఉన్నారు. పని ఒత్తిడి, ఏఐవంటి మార్పులపట్ల భయం పెరిగిపోతోంది. ఇలాంటి సమయంలో డగ్లస్ మాటలు మనకు ధైర్యాన్నిస్తాయి.

ఏదైనా కష్టంగా అనిపిస్తోందంటే -అది మీరు ఆగిపోవాలనడానికి సంకేతం కాదు. మీరు ప్రగతి దిశగా అడుగులు వేస్తున్నారనడానికి రుజువు. ప్రతి సవాలూ ఒక మెట్టు; ప్రతి ఘర్షణా ఒక పాఠం. కాబట్టి, ఇబ్బందిని శత్రువుగా కాక, మిమ్మల్ని తీర్చిదిద్దే గురువుగా చూడండి. ఎందుకంటే, పోరాటం లేనిదే ప్రగతి లేదు.

---




దొరికినందుకు సంతోషపడుతూనే ఉండాలి. చుట్టూ ఉన్న వారిని అభినందిస్తూనే ఉండాలి. చిన్న విషయాల్లోనూ మంచిని వెతుకుతూనే ఉండాలి. ఇవన్నీ ఒకెత్తు.. ఆ కృతజ్ఞతను వ్యక్తం చేయడం మరో ఎత్తు. ఎంత మనసులో భావించినా.. ఎంత గుండెలో దాచుకున్నా.. నోరు తెరచి చెప్పనంతవరకూ అది అవతలివారికి చేరదు. సరైన సమయంలో చెప్పిన ధన్యవాదమే సంబంధాలకు మెరుపులద్దుతుంది. ఆలస్యమైన కృతజ్ఞత కంటే, సమయానికి చెప్పిన ఒక్కమాట విలువ ఎంతో ఎక్కువ. ఎందుకంటే కృతజ్ఞత మనసులో దాచుకునే నిధి కాదు, పంచుకునే వెలుగు. పంచినకొద్దీ మరింత ప్రకాశిస్తుంది.

-మహాదేవ

---

**వింతల్లో వింతలు**

## ఆకాశంలో అడ్డంగా భవనం!



ఆకాశహర్మ్యాలంటే పైకి ఎదిగేవే అనుకుంటాం. చైనా మాత్రం అడ్డంగా ఆలోచించింది. చాంగ్‌కింగ్ నగరంలో యాంగ్జీ-జియాలింగ్ నదులు కలిసేచోట నిర్మించిన 'ద క్రిస్టల్' ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన "హారిజాంటల్ స్కైస్క్రేపర్". భూమికి 250 మీటర్ల ఎత్తున, నాలుగు భవనాలపైన అడ్డంగా పడుకున్న నిర్మాణం పొడవు 300 మీటర్లు. అంటే మూడు ఫుట్‌బాల్ మైదానాల అంత! దీని ఉక్కు బరువు 12,000 టన్నులు. ఏకంగా ఈఫిల్ టవర్‌తో సమానం. తేడా ఏంటంటే -ఈఫిల్ టవర్ తన బరువును నేలపై ఆనుకుంటే, క్రిస్టల్ ఆ బరువంతా గాల్లో నాలుగు స్తంభాలపై మోపుతోంది! లోపల గాజు అంతస్తుపై నడుస్తూ కింద నడుస్తున్న పడవలను చూడొచ్చు, 110కి పైగా చెట్లతో ఆకాశంలోనే ఓ చిన్న అడవి కూడా ఉంది. ధైర్యం ఉంటేనే అడుగు పెట్టండి -కిందకు చూస్తే గుండె ఆగిపోవడం ఖాయం!




# మెగా మూవీ లాంచ్‌లో చరణ్ మిస్

158వ సినిమాను షురూ చేశారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. బాబీ దర్శకత్వంలో రానున్న ఈచిత్రం గురువారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. పవన్ కల్యాణ్ క్లాప్ కొట్టగా.. చిరు కుమార్తె సుస్మిత కెమెరా స్విచ్ ఆన్‌చేశారు. పలువురు టాలీవుడ్ ప్రముఖులు హాజరయ్యారు. నిర్మాత కె వెంకట నారాయణ తెలుగులో చేస్తున్న మొదటి సినిమా ఇది. కాగా భారీ లెవెల్లో సినిమా ముహూర్త కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే టాలీవుడ్‌నుంచి అనేకమంది సినీ పెద్దలు, ప్రముఖులు హాజరైన ఈ ఈవెంట్‌లో రామ్ చరణ్ కూడా వస్తున్నట్టు మేకర్స్ బిగ్ అప్డేట్ అందించారు. కానీ అనూహ్యంగా రామ్‌చరణ్ ప్రెజెన్స్ మిస్ కావడం ఒకింత అభిమానులని డిజప్పాయింట్ చేసింది. దీనితో చరణ్ రాకపోవడానికి కారణం ఏంటా? అని అభిమానులు సస్పెన్స్‌లో ఉన్నారు. అయితే చరణ్ ఇప్పుడు ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. మరి బహుశా వాటిలో బిజీగా ఉండి రాలేదేమో కానీ.. చరణ్ ప్రెజెన్స్ కూడా ఉండివుంటే కార్యక్రమం ఫుల్‌ఫ్లెడ్జ్‌గా అనిపించేది.

హాట్ స్టార్!






## వాటికన్ సిటీలో నయన్-విఘ్నేశ్..

క్యూట్ కపుల్ నయనతార- విఘ్నేశ్ శివన్ వెకేషన్‌కు వెళ్లారు. సినిమా విరామ సమయాల్లో టూర్స్‌కు వెళ్లే వీరిద్దరూ తాజాగా వాటికన్ సిటీ వెళ్లినట్టు సోషల్ మీడియాలో వెల్లడించారు. పిల్లలతో కలిసి దిగిన ఫొటోలను పంచుకుంటూ 'నాకెంతో ఇష్టమైన వాటికన్..' అని నయనతార క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

## సారీ.. ఇంకా గట్టిగా..

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ ఇటీవల కొందరు ఫొటోగ్రాఫర్లపై కోప్పడిన విషయం సోషల్ మీడియాలో వైరలైన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన మీడియాను సరదాగా ఆట పట్టించిన ఓ వీడియో షేర్ అవుతోంది. ఫొటోగ్రాఫర్లు ఆయనకు సారీ చెప్పగా.. 'గట్టిగా సారీ చెప్పండి.. ఇంకా గట్టిగా చెప్పండి' అని భాయ్ వాళ్లను ఆట పట్టించారు. అసలేం జరిగిందంటే.. ఇటీవల సల్మాన్ తన బంధువులను పరామర్శించడానికి ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ ఆయన కారును గమనించిన కొందరు ఫొటోగ్రాఫర్లు ఆయన బయటకు రాగానే 'మాతృభూమి' సినిమా అప్డేట్ చెప్పాలని వెంబడించారు. దీంతో ఆయనకు కోపం వచ్చి.. 'మీకేమైనా పిచ్చా.. సినిమా ముఖ్యమా.. మనిషి ప్రాణాలు ముఖ్యమా' అని కోప్పడ్డారు. ఆ వీడియో వైరల్ అయింది. తాజాగా సల్మాన్ 'రాజా శివాజీ' మూవీ ఈవెంట్‌కు హాజరయ్యారు. అయనను చూడగానే కొందరు ఫొటోగ్రాఫర్లు సారీ చెప్పారు. దీంతో సల్మాన్ వారిని ఆట పట్టించారు. 'సినిమా అప్డేట్ ఇలాంటిచోటే అడగాలి' అని అన్నారు. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృ భూమి'తో పాటు వంశీపైడిపల్లితో సినిమా చేస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఇందులో సల్మాన్‌కు జోడీగా నయనతార నటిస్తున్నారు. దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





## దేవర-2 లేనట్టేనా!

ఎన్టీఆర్ హీరోగా సిద్ధమవుతున్న సెన్సేషనల్ ప్రాజెక్ట్ "డ్రాగన్'. ఇక ఈ చిత్రం తర్వాత ఎన్టీఆర్ లైనప్‌లో మరిన్ని భారీ సినిమాలున్నాయి. అయితే వీటిలో దేవర-2 సినిమా ఒకటి. దర్శకుడు కొరటాల శివ ఈ సినిమా స్క్రిప్ట్ పనులు కూడా పూర్తి చేసినట్టు టీంనుంచి క్లారిటీ వచ్చింది. కానీ సినిమా ఉంటుందా? ఉండదా? అనే సస్పెన్స్ ప్రశ్న మాత్రం అలా కొనసాగుతోంది. ఇదిలావుంటే, సినిమా విషయంలో తారక్ పుట్టినరోజు సందర్భంగా దేవర నిర్మాణ సంస్థ బర్త్ డే విషెస్ చెప్పారు. కానీ దేవర-2 కోసం ఎలాంటి హింట్ ఇవ్వలేదు. పైగా ఇంకా ఇంట్రెస్టింగ్ అంశం ఏంటంటే మొన్నామధ్య జాన్వీ కపూర్‌కి బర్త్ డే విషెస్ చెప్పిన దేవర హ్యాండిల్ నుంచి తారక్ పుట్టినరోజు విషెస్ కూడా రాలేదు. సో వీటితో దేవర-2 ప్రస్తుతానికి హోల్డ్‌లో ఉందా? లేక పూర్తిగా లేనట్టేనా? అనే ప్రశ్న మళ్లీ మొదటికే వచ్చింది.

## రియల్ హీరో.. రామ్ పోతినేని

టాలీవుడ్‌లో స్టార్ హీరోలపై అభిమానుల ప్రేమ గురించి తరచూ వింటుంటాం. కానీ ఒక్కోసారి హీరోలు అభిమానుల కోసం చేసే చిన్న పనులే వారిని తెరపై హీరోలుగా మాత్రమే కాకుండా నిజ జీవితంలోనూ ప్రత్యేకంగా నిలబెడతాయి. తాజాగా హీరో రామ్ పోతినేని చేసిన ఓ పని ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, మాస్ పెర్ఫార్మెన్స్‌లతో ప్రేక్షకులను అలరించే రామ్, ఈసారి మాత్రం తన పెద్ద మనసుతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. గత 18 ఏళ్లుగా అరుదైన నరాల సంబంధిత వ్యాధి ఫ్రెడ్రిచ్ అటాక్సియాతో పోరాడుతున్న ఓ వీరాభిమాని కోరికను ఆయన స్వయంగా నెరవేర్చడం ఇప్పుడు అందరినీ భావోద్వేగానికి గురిచేస్తోంది. తన అభిమాన హీరోను ఒక్కసారైనా కలవాలని ఆ యువతి చాలాకాలంగా కోరుకుంటున్నట్టు తెలిసింది. ఆ విషయం తెలుసుకున్న రామ్, ఎలాంటి ప్రచారం లేకుండా నేరుగా ఆమె ఇంటికే వెళ్లి పరామర్శించారు. కొద్దిసేపు ఆమెతో మాట్లాడి ధైర్యం చెప్పడమే కాకుండా, కుటుంబ సభ్యులతోనూ సమయం గడిపినట్లు సమాచారం. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. "రియల్ హీరో అంటే ఇలానే ఉండాలి" అంటూ అభిమానులు, నెటిజన్లు రామ్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఇక కెరీర్ విషయానికి వస్తే, రామ్ ప్రస్తుతం తన 23వ ప్రాజెక్ట్‌పై దృష్టి సారించారు. ఆర్పీ23 పేరుతో రూపొందుతున్న చిత్రం, "ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వోల్ఫ్" అనే ట్యాగ్‌లైన్‌తో స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సినీవర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. జూన్‌నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.



## 'ప్లేబాయ్' పాత్రలో బాబీ డియోల్


బాలీవుడ్ స్టార్ నటుడు బాబీ డియోల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ బందర్. 'యానిమల్' సినిమాతో గ్లోబల్‌స్థాయిలో తన పవర్‌ఫుల్ నటనతో ఆకట్టుకున్న బాబీ డియోల్, మరోసారి అంతకుమించిన ఇంటెన్స్ రోల్‌లో ఈ చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ట్రైలర్ చూస్తుంటే.. బాబీ డియోల్ ఈ సినిమాలో ఓ రాక్ స్టార్‌గా, విలాసవంతమైన జీవితాన్ని గడిపే 'ప్లేబాయ్' పాత్రలో కనిపిస్తున్నాడని తెలుస్తుంది. అయితే,



అంతా సాఫీగా సాగిపోతున్న సమయంలో అతను అనుకోకుండా జైలు పాలు కావాల్సి వస్తుంది. అసలు బాబీ జైలుకు ఎందుకు వెళ్ళాడు? అతనిపై కేసు పెట్టిన యువతి ఎవరు? అనే ఆసక్తికర అంశాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇక ఈ చిత్రంలో బాబీ డియోల్‌తోపాటు సన్యా మల్హోత్రా, సబా ఆజాద్ మరియు సప్నా పబ్బి కీలక పాత్రల్లో మెరుస్తున్నారు. ఈ సినిమాకు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహిస్తుండగా.. నిఖిల్ ద్వివేది, అనురాగ్ కశ్యప్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అన్ని హంగులతో, హై వోల్టేజ్ డ్రామాతో రూపొందుతున్న చిత్రం జూన్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. బాబీ డియోల్ కొత్త మేకోవర్ చూస్తుంటే.. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచడం ఖాయంగా కనిపిస్తోంది.

## 'ఐ యామ్ గేమ్' అంటున్న దుల్కర్

మలయాళస్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'ఐ యామ్ గేమ్'. ఆర్డీఎక్స్'లాంటి బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందించిన నహాస్ హిదాయత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న చిత్రంనుంచి తాజాగా విడుదల తేదీని ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమాను ఓనమ్ పండగ కానుకగా ఆగస్టు 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. 2023లో వచ్చిన 'కింగ్ ఆఫ్ కోత' తర్వాత దుల్కర్ సల్మాన్ మళ్లీ మలయాళ సినిమా చేస్తుండటంతో ఈ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ఆంటోనీ వర్గీస్ పెపే, ఐశ్వర్యలక్ష్మి, తమిళ్ దర్శకుడు మిస్కిన్, కతీర్, కాయాదు లోహర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషల్లోనూ విడుదల కానుంది.



Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com